క్లుప్తంగా

ఆర్ఐకు సన్మానం



బదిలీపై వెళ్లిన సోమశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గోరంట్ల: గోరంట్ల మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సోమశేఖరరెడ్డిని ఇటీవల మడకశిర రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. గురువారం తహసీల్దార్ మారుతీప్రసాద్ రిలీవ్ చేశారు. తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది పూలమాలతో సన్మానించి, వీడ్కోలు పలికారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు శిక్షణ



పరేడ్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

హిందూపురం టౌన్: పుట్టపర్తిలో ఈనెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. గురువారం పట్టణంలోని చిన్మయ విద్యాలయం క్రీడామైదానంలో హెడ్ కానిస్టేబుళ్లు బొమ్మన ప్రసాద్, ఇక్బాల్ తదితరులు హిందూపురంలోని పలు పాఠశాలల, కళాశాలల ఎన్‌సీసీ, గురుకుల, స్కౌట్స్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. పరేడ విజయవంతం అయ్యేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

పెనుకొండ రూరల్: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి దర్గా సర్కిల్ వరకు. విద్యార్థులతో కలసి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ర్యాలీ చేపట్టారు. మంత్రి మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం ముఖ్యమన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. సీటు బెల్ట్ లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి, సీఐ రాఘవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: రోగులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వైద్యసిబ్బందికి సూచించారు. గురువారం ఆర్అండ్‌బీ బంగ్లాలో ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. రోగులకు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించనని హెచ్చరించారు. ఆస్పత్రిలో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి ఆమోదం తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మెడికల్ ఆఫీసర్ శశిరేఖ, ఆర్ఎంఓ దివాకర్, అభివృద్ధి కమిటీ సభ్యులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

హిందూపురం: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నూతన డిపో కమిటీని గురువారం యూనియన్ ఆర్టీసీ డిపో చైర్మన్ కిరణ్ కుమార్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. డిపో అధ్యక్షుడిగా రంగనాథ్, సెక్రటరీగా వెంకటేశులు, కోశాధికారిగా రవిచంద్ర, డిపో చైర్మన్‌గా కిరణ్ కుమార్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాబా ఫకృద్దీన్, గ్యారేజ్ కార్యదర్శిగా రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీ రమణ, జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజారెడ్డి, నాయకులు షబ్బీర్, రవితేజ, భారతి విజయలక్ష్మి, వలిసాబ్, ముద్దప్ప పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో తనిఖీలు



బీఎస్‌టీ పెట్రోల్ బంకులో కొలతలను పరిశీలిస్తున్న అధికారులు

హిందూపురం టౌన్: పట్టణంలోని బీఎస్‌టీ పెట్రోల్ బంకులో గురువారం సీఎస్‌డీటీ హారతి, తూనికలు, కొలతల అధికారులు తనిఖీలు నిర్వహించారు. పెట్రోల్ బంకులో సరిగా పెట్రోల్ వేయడం లేదని, పెట్రోల్ తూకాల్లో వ్యత్యాసం ఉన్నట్లు ఇటీవల అధికారులకు ఫిర్యాదులు అందాయి. గురువారం పెట్రోల్ బంకులను పరిశీలించిన అధికారులు.. పెట్రోల్‌లో వ్యత్యాసాన్ని పరిశీలించారు. అయితే అందులో ఎలాంటి వ్యత్యాసం లేదని అధికారులు నిర్ధారించారు.

డేంజర్ జోన్లు



- నెత్తురోడుతున్న జాతీయ రహదారులు
- ప్రమాదకరంగా వై జంక్షన్లు





పెనుకొండ వద్ద రోడ్డుపై బోల్తా పడిన బొలెరో (ఫైల్), పేటకుంట వద్ద ఢీ కొన్న వాహనాలు (ఫైల్)

సోమందేపల్లి: వై జంక్షన్లు డేంజర్ జోన్లుగా మారాయి. 44 జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తరచూ రహదారులు నెత్తురోడుతున్నాయి. దీంతో వాహనదారులు తమ ప్రాణాలు కోల్పోతున్నారు. జాతీయ రహదారిపై ప్రమాద నివారణ చర్యలు చేపట్టకపోవడంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చెప్పన్నారు. గోరంట్ల మండలలోని పాలసముద్రం, పేటకుంట, సోమందేపల్లి మండలంలోని నల్లగొండ్రాయనపల్లి, వైఎస్సార్ సర్కిల్, పెనుకొండ మండలంలోని కృష్ణ దేవరాయల జంక్షన్, హరిపురం, దుద్దేబండ, గుట్టూరు క్రాస్‌లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. హైదరాబాద్ బెంగళూరు ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. వాహనాలు అతివేగంగా వెళ్తూ రహదారిపైనే బోల్తా పడడంతో ఓ వైపు వెళ్లే వాహనాలు మరో వైపు వచ్చి ప్రమాదానికి గురవుతున్నాయి. వాటికి తోడు కియా అనుబంధ పరిశ్రమలకు వెళ్లే బస్సులు అతివేగం కారణంగా కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. హైవేపై స్పీడ్ గన్, డ్రంక్ అండ్ డ్రైవ్, ఆర్టీఓ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రమాదాలకు 'ఎదురు వెళ్తున్నారు'

మిషన్‌తండా, ఎస్ఎల్ ఏపీ, కియా పరిశ్రమకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు రాంగ్ రూట్‌లో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో కార్లు, ద్విచక్ర వాహనాల్లో వచ్చే వాహనాలకు ఎదురెళ్లి రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నారు. కనీసం ఇప్పటికైనా పోలీసులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాల వివరాలు..

- గతేడాది అక్టోబర్ 26న సోమందేపల్లి మండలంలోని వెలుగు మాకులపల్లి జంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్లు దాటి టమోట లోడుతో వెళ్లే లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది.
- పెనుకొండ మండలంలోని పులేకమ్మ ఆలయం వద్ద గతేడాది అక్టోబరు 26న రోడ్డుపై అడ్డుగా ఆపి ఉన్న లారీని ద్విచక్ర వాహనదారుడు వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు.
- గతేడాది నవంబర్ 6న కియా పోలీస్ స్టేషన్ పరిధిలో హైవేపై కుమార్తె భవితతో కలిసి తండ్రి రమేష్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుకవైపు నుంచి బొలేరో ఢీకొంది. ఈ ప్రమాదంలో కుమార్తె భవిత రోడ్డు ప్రాణాలు కోల్పోయింది.
- నవంబరు 24న వెలుగుమాకులపల్లి వద్ద కారు ఢీ కొనడంతో సెక్యూరిటీ గార్డు మృత్యువాత పడ్డాడు.
- ఈ ఏడాది జనవరి 7న సోమందేపల్లి మండలంలోని ఎస్.ఎల్.ఏపీ పరిశ్రమ ఎదుట మూడు వాహనాలు ఒక దానికి ఒకటి ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది.



వెలుగుమాకులపల్లి వద్ద ప్రమాద దృశ్యం (ఫైల్)

ఫ్లై ఓవర్లు నిర్మించాలి



సోమందేపల్లికి అనంతపురం వైపు నుంచి వెళ్లాలంటే జాతీయ రహదారి దాటాలి. కానీ బెంగళూరు హైదరాబాద్ వైపు నుంచి అతివేగంగా వాహనాలు వస్తాయి. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫ్లై ఓవర్ నిర్మిస్తే ప్రమాదాలు తగ్గుతాయి. ఎదురుగా వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– నరసింహులు, సోమందేపల్లి

రోడ్డు దాటాలంటే సాహసమే..



44వ జాతీయ రహదారి రోడ్డు దాటాలంటే భయమేస్తుంది. పాలసముద్రం జంక్షన్ నుంచి కదిరి, హిందూపురం, పెనుకొండ, బెంగళూరుకు వెళ్లాల్సి ఉంది. అతి వేగంగా వాహనాలు వచ్చి ప్రమాదాలు జరగుతున్నాయి. వై జంక్షన్‌లో ఓ పోలీసు కానిస్టేబుల్‌ను నియమిస్తే ట్రాఫిక్‌కు కంట్రోల్ చేయడానికి బాగుంటుంది.

– నారాయణ రెడ్డి, గోరంట్ల

వాహనాలు నిలిపితే రూ.10 వేల జరిమానా



రోడ్డుపై వాహనాలు ఆపి ప్రమాదాలకు కారణమైతే రూ.10 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తాం. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించి సహకరించాలి. జాతీయ రహదారిపై అడ్డుగా వచ్చే కంపెనీ బస్సుల నిర్వాహకులకు ఇప్పటికే ఫైన్ వేశాం. ఇలాగే వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాల కేసుల్లో బాధ్యులను చేస్తాం. జాతీయ రహదారిపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు పాఠశాలలు, గ్రామాల్లో ఇటీవల ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, స్పీడ్ గన్ వినియోగంపై దృష్టి సారిస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ, పెనుకొండ

తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

హిందూపురం టౌన్: తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరు. తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే అని సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ అన్నారు. గురువారం స్థానిక ఉపకారాగారాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, నిందితులతో నేరుగా మాట్లాడారు. ఏయే తప్పులు చేసి జైలుకు వచ్చారు? ఎప్పటి నుంచి జైలులో ఉంటున్నారని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చట్టం దృష్టిలో అందరూ సమానమే అన్నారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిందితులు డబ్బులు వెచ్చించి న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేకపోతే ప్రభుత్వమే ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని పేర్కొన్నారు. అలాంటి నిందితులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఖైదీలకు తయారు చేస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, ఆరోగ్య సంరక్షణ తదితర విషయాలపై ఉపకారాగార అధికారి హనుమన్నను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణమూర్తి, నరసింహమూర్తి, రవికుమార్, హఫ్నా తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో కృష్ణా బోర్డు ఏర్పాటు చేయాలి



మంత్రి సవితకు వినతిపత్రం అందిస్తున్న జలసాధన సమితి నాయకులు

పెనుకొండ: ఉమ్మడి అనంతపురం జిల్లా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని మంత్రి సవితకు జలసాధన సమితి నాయకులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కృష్ణానది యాజమాన్య బోర్డు రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కానీ ఇప్పటికీ బోర్డు హైదరాబాద్‌లోనే ఉందన్నారు. ఈనెల 21న జరిగిన కృష్ణా బోర్డు సమావేశంలో బోర్డును విజయవాడకు తరలించడానికి కృష్ణానది బోర్డు ఏపీ తెలంగాణా రాష్ట్రాలు ఆమోదించాయన్నారు. కృష్ణా బోర్డు విజయవాడకు తరలిస్తే కృష్ణా జలాల్లో రాయలసీమ ప్రాంతానికి 15 లక్షల ఎకరాలకు కృష్ణా జలాలు తరలించాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కృష్ణా జలాల బోర్డు కర్నూలులో ఏర్పాటు చేసే విధంగా విన్నవించారు. కార్యక్రమంలో జలసాధన సమితి నాయకులు వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జమీల్,శ్రీరాములు, వెంకటేష్ పాల్గొన్నారు.

నవోదయలో క్విజ్ పోటీలు

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం పరాక్రమ దివస్‌లో భాగంగా ప్రిన్సిపాల్ నాగరాజు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ మాస్టర్‌గా విద్యాలయానికి చెందిన అసఫీ, అనుసంధానకర్తగా రాధారెడ్డి, వెంకటరమణ వ్యవహరించారు. పోటీల్లో 7 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయం సాధించారు. మిగిలిన పాఠశాలలు విద్యార్థులు కూడా ప్రతిభ చాటారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

మడకశిరరూరల్: జిల్లెడుగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం భూతన్న మాట్లాడుతూ బోస్ స్వాతంత్ర్య పోరాటాన్ని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఉపాధ్యాయులు సునీత, ఇందిరమ్మ, కరియన్న, లలితమ్మ, రామాంజనేయులు పాల్గొన్నారు.



జిల్లెడుగుంటలో మాట్లాడుతున్న హెచ్ఎం భూతన్న

పావగడ: స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ వేంకటేశ్వర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల ట్రెజరర్ పరంధామరెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండ: జననమే తప్ప మరణం లేని మహానేత నేతాజీ సుభాస్ చంద్రబోస్ అని చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. పట్టణంలోని మిట్టాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న సుభాస్ చంద్రబోస్ విగ్రహానికి మంత్రి సవిత పూలమాల వేశారు. మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయప్ప, నాయకులు శ్రీనివాసులు, శ్రీరాములు యాదవ్, శ్రీనివాసులు, తిరుపతేంద్ర, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: యువత మత్తుపదార్థాలకు దూరం ఉండాలని బాలాజీ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప అన్నారు. గురువారం బాలాజీ డిగ్రీ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ రామచంద్ర డాక్టర్ ఆదినారాయణ, ఎంఈఓ గంగప్ప, టూటౌన్ ఎస్ఐ బ్రహ్మానందరెడ్డి, రోటరీ క్లబ్ ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ విద్య పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

లేపాక్షి: మండలాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ వెంకటరత్నమ్మ పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులను గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉందన్నారు. ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశులు మాట్లాడుతూ.. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కొండూరు, లేపాక్షి, కంచిసముద్రం ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎంపీటీసీ ఆదినారాయణ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఖాళీగా ఉన్న ఇంటి స్థలాలను ఇళ్లు లేని నిరుపేదలకు అందజేయాలని కోరారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి మాట్లాడుతూ.. మండలంలో రెండవ ఫేస్ కింద మానేపల్లిలో రీ సర్వే చేయడం జరుగుతుందన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ లీలావతి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఏఓ శ్రీలత, ఉద్యానశాఖ అధికారి మహేష్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, గ్రామ, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరత్నమ్మ

29న మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం: ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 29న ఉదయం 10-30 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామరావు, ఎంపీపీ ఈరన్నలు తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజారు కావాలని కోరారు.

మారెమ్మ జాతరకు ఆహ్వానం

హిందూపురం: మండలంలోని తూమకుంట గ్రామంలో ఈనెల 28వ తేదీన జరగనున్న మారెమ్మ జాతరకు రావాలని నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక, నాయకుడు వేణురెడ్డిని గ్రామస్తులు ఆహ్వానించారు. గురువారం వారు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త దీపికను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. శుక్రవారం కలశ స్థాపన, శాంతి హోమాల పూర్ణాహుతి, 25వ తేదీన ఆంజనేయస్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో దీపోత్సవాలు, 26న సత్యమ్మ, సప్పలమ్మ ఆలయాల్లో దీపోత్సవాలు జరుగుతాయన్నారు. 27న శివాలయంలో కలశాలు, 28న మారెమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవానికి హాజరు హాజరుకావాలని ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వీ శివ, తూమకుంట దేవరాజు, రామాంజి, పెద్ద తిమ్మయ్య, హయత్ బాషా పాల్గొన్నారు.



నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక, నాయకుడు వేణురెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న తూమకుంట గ్రామస్తులు

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

మడకశిరరూరల్: ఈచలడ్డి గ్రామంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ రామిరెడ్డి తెలిపారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రేపు జాతీయ ఓటరు దినోత్సవం

లేపాక్షి: ఈనెల 25వ తేదిన జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు దినోత్సవం జరుపుకోవాలన్నారు. కొత్తగా నమోదైన వారికి ఓటరు కార్డులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. ఈవీఎం, వీవీప్యాట్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి రెడ్డి, పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

హిందూపురం టౌన్: పట్టణంలోని సూరప్పకట్ట కింద వాల్మీకి వీధిలో వెలసిన వాల్మీకి శ్రీరామ దేవాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఆలయంలో గంగపూజ, గోపూజ, కళశస్థాపన, గణపతి వాస్తు హోమాలు, స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. శుక్రవారం ఉదయం నుంచే ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకాలు, నవగ్రహ, మృత్యుంజయ, నక్షత్ర హోమాలు, శ్రీరామ రక్షస్తోత్ర హోమం, బలి, పూర్ణాహుతి, కుంభాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రొళ్ల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ పేర్కొన్నారు. గురువారం న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటు కోసం అగ్రహారం, దొడ్డేరి, కాకి-2, పి.గొల్లహట్టి అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేశారు. ఎల్.కే.పల్లివడ్రహట్టిలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ గార్డెన్‌ను పరిశీలించారు. అనంతరం కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి చిన్నారుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో ఆకు కూరలు, బొప్పాయ, మునగ, మూలంగి, కొత్తిమిర, కరివేపాకుతో పాటు టమాట వంటివి నాటు కోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

కదిరి లక్ష్మీనరసింహ ఆలయానికి పాదయాత్ర

హిందూపురం: హిందూపురం నుంచి కదిరిలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి 200 మంది భక్తులు గురువారం పాదయాత్రగా బయలుదేరారు. స్థానిక గాంధీ సర్కిల్‌లో త్వరలో నిర్మించనున్న నరసింహ ఆలయ స్థలం వద్ద నుంచి పూజలు చేసి నమో: నరసింహ అంటూ జయధ్వనాలు పలికి బయలుదేరారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. ంభాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల: బీసీ, ఈ-బీసీ, బ్రహ్మణ, వైశ్య, కాపు, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందడానికి ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు గురువారం తెలిపారు. 21 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపున్న వారు అర్హులని, ఒక్కో యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉంటుందన్నారు. ప్రధానమంత్రి జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు చేసుకోవడం కోసం కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ పూర్తి చేసిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్

రొద్దం: మండలంలోని సానిపల్లిలో శుక్రవారం ఉదయం 7 గంటలకు కాఫీ విత్ వైఎస్సార్ సీపీ లీడర్స్ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ హాజరవుతారన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మడకశిరలో దొంగల హల్‌చల్

మడకశిర: పట్టణంలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మధుగిరి రోడ్డులోని ఓ సూపర్ మార్కెట్‌లో దూరి చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నలుగురు దుండగులు సూపర్ మార్కెట్ బీగాలు పగులగొట్టి షట్టర్‌ఎత్తి లోనికి దూరారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. సూపర్‌మార్కెట్ యజమాని క్యాష్ కౌంటర్‌లో రూ.600 మాత్రమే ఉంచడంతో దాన్ని మాత్రమే తీసుకెళ్లారు. ఇతర వస్తువులను ముట్టలేదు. దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీకెమెరాల్లో ఘటన మొత్తం రికార్డయింది. పోలీసులు ఘటన స్థలికి చేరుకుని వివరాలు సేకరించడంతో పాటు సీసీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా పట్టణంలో తరచూ దొంగతనాలు జరుగుతూనే ఉన్నా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోవడంతోనే ఈపరిస్థితి ఏర్పడిందని పట్టణ ప్రజలు వాపోతున్నారు.



సూపర్‌మార్కెట్‌లో నగదు కోసం వెతుకుతున్న దొంగలు

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన

హిందూపురం: గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుని ఆరోగ్యాలను కాపాడుకోవాలని సుధ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ అనూష రెడ్డి సూచించారు. గురువారం బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భాశయ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం వాటి నివారణ చర్యలతో ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. మహిళల ఆరోగ్య సమస్యలపై విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ.. అవగాహన నివారణకు మొదటి అడుగు అని.. ఏదైనా ముందస్తు చర్యలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

'భూ సురక్ష యోజన' సద్వినియోగం చేసుకోండి

పావగడ: భూ సురక్ష యోజన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, తుముల్ అధ్యక్షుడు హెచ్‌వీ వెంకటేశ్ రైతులకు సూచించారు. స్థానిక తాలూకా కార్యాలయంలో గురువారం ఆయన భూ సురక్ష యోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పాత దాఖలాలను రెన్యూవల్ చేయించుకుని తమ భూములను కాపాడు కోవాలన్నారు. తుముల్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎమ్మెల్యే వెంకటేశ్ ను తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ రాజేశ్, కౌన్సిలర్ టెంకాయల రవి, ఎగువపల్లి నాని పాల్గొన్నారు.